అర్హత లేని పైలట్ల చేతికి విమానం

ఎయిర్ ఇండియాకు 90 లక్షల జరిమానా

న్యూఢిల్లీ: అర్హత లేని పైలట్లతో విమానాన్ని నడిపినందుకుగాను టాటా గ్రూప్ యాజమాన్యంలోని 'ఎయిర్ ఇండియా'పై డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ సివిల్ ఏవియేషన్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విమాన యాన భద్రతను తీవ్రంగా ప్రభావితం చేసినందుకు రూ.90 లక్షలు జరిమానా విధించింది. ఆ సంస్థ అధికారులు పంకుల్ మాథుర్‌కు రూ.6 లక్షలు, మనీశ్ వాసవడకు రూ.3 లక్షలు ఫైన్ విధించినట్టు డీజీసీఏ శుక్రవారం తెలిపింది. ఎయిర్ ఇండియా కొద్ది రోజుల క్రితం ఓ నాన్-ట్రెయినర్ లైన్ క్యాప్టన్, నాన్-లైన్ ఫస్ట్ ఆఫీసర్‌తో ఓ విమానాన్ని నడిపినట్టు తేలింది.

'జ్ఞానవాపీ వాజుఖానాలో సర్వేకు వీల్లేదు'

ప్రయాగ్‌రాజ్: జ్ఞానవాపీ మసీదు వాజుఖానాలో ఏఎస్ఐ సర్వే చేయడానికి అనుమతి లేదని అలహాబాద్ హైకోర్టుకు మసీదు నిర్వహణ కమిటీ తెలిపింది. ఈ ప్రాంతాన్ని పరిరక్షించాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నందున, సర్వే చేయడానికి వీల్లేదని పేర్కొన్నది. వాజుఖానాలో సర్వే నిర్వహించడానికి అనుమతి కోరుతూ అలహాబాద్ హైకోర్టును ఏఎస్ఐ (పురావస్తు శాఖ) ఆశ్రయించింది. దీనిపై గురువారం అంజుమన్ ఇంతెజామియా కమిటీ కౌంటర్ దాఖలు చేసింది. వాజుఖానా, శివ లింగానికి సంబంధించిన అంశాలు సుప్రీంవిచారణలో ఉన్నాయని, ఈ ప్రాంతాన్ని పరిరక్షించాలని వారణాసి కలెక్టర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించినట్టు తెలిపింది.

'కించపరిచే ఉద్దేశం ఉంటేనే ఎస్సీ, ఎస్టీ చట్టం వర్తింపు'

న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ (దౌర్జన్యాల నిరోధం) చట్టం ప్రకారం ఏ ఫిర్యాదునైనా నేరంగా పరిగణించాలంటే కేవలం ఫిర్యాదుదారు ఎస్సీ లేదా ఎస్టీ అయినంత మాత్రాన సరిపోదని సుప్రీంకోర్టు శుక్రవారం చెప్పింది. ఫిర్యాదుదారును కించపరిచే ఉద్దేశం నిందితునికి లేనిదే ఈ చట్టం ప్రకారం నేరంగా పరిగణించరాదని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన కేసులో యూట్యూబర్ షాజన్ స్కరియాకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తనకు ముందస్తు బెయిల్‌ను కేరళ హైకోర్టు తిరస్కరించడంపై షాజన్ చేసిన అప్పీల్‌పై సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది.

జెలెన్‌స్కీతో మోదీ ఆలింగనం

శాంతి వైపు ఉన్నాం

కీవ్: గత రెండున్నర ఏండ్లుగా సాగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో భారత్ ఎప్పుడూ తటస్థంగా లేదని, ఈ యుద్ధంలో భారతదేశం శాంతి వైపు మాత్రమే నిలబడుతున్నదని ప్రధాని మోదీ అన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యుద్ధక్షేత్రంలో గాయపడ్డ సైనికులు, ఇతరుల ప్రాణాలు కాపాడేందుకు 4 'భీష్మ క్యూబ్స్'ను మోదీ ఉక్రెయిన్‌కు అందజేశారు.

మగ జాతి అంతమవుతుందా?!



- క్రమంగా కనుమరుగవుతున్న 'వై' క్రోమోజోమ్స్
- 900 జన్యువుల నుంచి 55కు పడిపోయిన వైనం
- జపాన్ పరిశోధకుల అధ్యయనంలో కీలక విషయాలు
- లింగ నిర్ధారణలో 'వై' క్రోమోజోమ్సదే కీలక పాత్ర

న్యూఢిల్లీ, ఆగస్టు 23/(స్పెషల్ టాస్క్ బ్యూరో): తల్లి కడుపులోని బిడ్డ లింగాన్ని నిర్ధారించడంలో పురుషుల శుక్రకణాల్లోని వై-క్రోమోజోమ్స్ కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, గడిచిన కొంతకాలంగా ఈ జన్యువుల సంఖ్య అంతకంతకూ తగ్గిపోతున్నదని, రానున్న కాలంలో ఇవి కనుమరుగైనా ఆశ్చర్యపోనవసరం లేదని జపాన్‌లోని హోక్కయిడో యూనివర్సిటీ పరిశోధకులు చేసిన ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఇదే జరిగితే, భవిష్యత్తులో పురుష జననాలు ఉండకపోవచ్చని పరిశోధకులు అంచనాకు వచ్చారు. అయితే, వైద్యశాస్త్రంలో అమల్లోకి వచ్చిన వినూత్న పద్ధతులు, ఆవిష్కరణల ద్వారా కొత్త జన్యువుల సృష్టితో ఈ సమస్యకు పరిష్కారాన్ని కనుగొనడం అంత పెద్ద కష్టమేమీ కాదని వాళ్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వివరాలు 'ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

కనుమరుగు ఇలా..

మనుషులు సహా క్షీరదాల వంటి పాలిచ్చే ఆడ జంతువుల్లో రెండు 'ఎక్స్' క్రోమోజోమ్స్ ఉంటాయి. మగవాటిలో ఒక ఎక్స్ క్రోమోజోమ్‌తో పాటు ఒక వై క్రోమోజోమ్ కూడా ఉంటుంది. ఇదే గర్భంలోని శిశువు లింగాన్ని నిర్ధారిస్తుంది. అయితే, పురుషుల్లోని ఎక్స్ క్రోమోజోమ్‌లో 900 వరకూ వివిధ రకాల జన్యువులు ఉండగా, 'వై' క్రోమోజోమ్‌లో మాత్రం వాటి సంఖ్య 900 నుంచి 55కు పడిపోయినట్టు పరిశోధకులు గుర్తించారు. గడిచిన 166 మిలియన్ సంవత్సరాల్లో ఈ మేరకు జన్యువుల క్షీణత జరిగినట్టు తెలిపారు. ఇది కొనసాగితే రానున్న 110 లక్షల ఏండ్లలో 'వై' క్రోమోజోమ్‌లోని మిగిలిన 55 జన్యువులు(ఎస్ఆర్‌వై జన్యువులు) కనిపించకుండా పోవచ్చని, గర్భంలోని ప్రతి శిశువు ఆడ శిశువుగానే పుట్టొచ్చని అభిప్రాయపడ్డారు.

వై క్రోమోజోమ్ ఎందుకు కీలకం?

గర్భం దాల్చిన 12 వారాల తర్వాత వృషణాలు ఏర్పడటాన్ని క్రమబద్ధీకరించే వాటిని ఈ 'వై క్రోమోజోమ్' ప్రేరేపిస్తుంది. గర్భస్థ పిండం వృషణాలు పురుష హార్మోన్లను (టెస్టోస్టిరాన్ వంటివాటిని) తయారు చేస్తాయి. ఫలితంగా బిడ్డ మగ శిశువుగా రూపొందుతాడు. అందుకే ఈ 'వై క్రోమోజోమ్'ను మాస్టర్ సెక్స్ జీన్‌గా పిలుస్తారు.

అలా జరుగొచ్చు కూడా..

తూర్పు ఐరోపాలో కనిపించే మోల్ వోల్స్ అనే ఎలుక జాతికి చెందిన మగ జంతువులు, జపాన్‌లో కనిపించే మగ స్పైన్ ఎలుకల్లో ఇప్పటికే 'వై' క్రోమోజోమ్స్ అంతరించిపోయాయని పరిశోధకులు తెలిపారు. అయినప్పటికీ, 'వై' క్రోమోజోమ్‌లోని జన్యువుల లక్షణాలు కలిగిన మరికొన్ని కొత్త జన్యువులు(ప్యూ జీన్స్) ఆయా మగ జీవుల్లో కొత్తగా పుట్టుకురావడంతో వాటి జాతి అంతరించిపోలేదని, కొత్తగా మగ పిల్లలు కూడా పుడుతున్నట్టు పరిశోధకులు తెలిపారు. మనుషుల్లోనూ ఇలానే జరగొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

కర్ణాటక పుట్టలో హైదరాబాద్ పాములు

- 187 కోట్ల 'వాల్మీకి' స్కామ్‌లో తెలంగాణకు 45 కోట్లు
- భాగ్య నగరానికి చెందిన 9 కంపెనీల ఖాతాలకు సొమ్ము
- ఈ సొమ్ముతోనే ఎన్నికల్లో మద్యం, వాహనాల కొనుగోలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలిత కర్ణాటకలోని 'కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్'లో వెలుగు చూసిన రూ.187 కోట్ల విలువైన కుంభకోణం హైదరాబాద్‌కూ పాకింది. ఈ విషయం సిట్ నివేదిక, ఈడీ విచారణలో తేలింది. కుంభకోణంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన తొమ్మిది కంపెనీల ఖాతాలకు రూ.44.6 కోట్లు జమ అయినట్టు సిట్ నివేదిక వెల్లడించింది.

ఏమిటీ స్కామ్?

'కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్'కు చెందిన పలు బ్యాంకు ఖాతాల్లో ఉండాల్సిన రూ.187 కోట్లు పక్కదారి పట్టాయి. వాల్మీకి కార్పొరేషన్ అకౌంట్స్ సూపరింటెండెంట్ పీ చంద్రశేఖరన్ గత మే 26న ఆత్మహత్య చేసుకునే ముందు రాసిన ఆరు పేజీల సూసైడ్ నోటులో స్కామ్ గురించి బయటపెట్టారు. దీనిపై విచారణ జరపాలని ఒత్తిడి పెరగడంతో సిద్ధరామయ్య ప్రభుత్వం.. సిట్ ఏర్పాటు చేసింది. ఈడీ సైతం రంగంలోకి దిగింది. లోక్‌సభ ఎన్నికల్లో మద్యం, డబ్బు పంచడం కోసమే 'వాల్మీకి కార్పొరేషన్' నిధులను అక్రమంగా వాడుకొన్నట్టు ఈడీ, సిట్ విచారణలో ప్రాథమికంగా తేలింది. కుంభకోణంలో భాగమైన మాజీ మంత్రి నాగేంద్ర, వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ బసనగౌడ దద్దల్, మరో ఇద్దరు బ్యాంకు అధికారులు సహా మొత్తం 11 మందిని ఈడీ అరెస్ట్ చేసింది.

హైదరాబాద్‌కు నగదు బదిలీ ఇలా..

రూ.187 కోట్లలో తెలుగు రాష్ట్రాలకు రూ.90 కోట్లు చేరినట్టు సిట్ అంతర్గత నివేదికలో వెల్లడించింది. సిట్ నివేదిక ప్రకారం.. వాల్మీకి కార్పొరేషన్ అప్పటి ఎండీ పద్మనాభ్, అకౌంట్స్ అధికారి పరశురామ్ బెంగళూరులోని యూబీఐ బ్యాంకు ఎంజీ రోడ్డు బ్రాంచీలో మార్చి 30, 2024న రూ.50 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ డిపాజిట్‌పై అదే రోజు రూ. 45 కోట్ల రుణం తీసుకొని, హైదరాబాద్‌లోని ఆర్బీఎల్ బ్యాంకుకు చెందిన 9 ఖాతాలకు రూ.44.6 కోట్లను బదిలీ చేశారు.

ఆ డబ్బుతో ఏం చేశారు?

హైదరాబాద్‌కు చేరిన రూ.44.6 కోట్ల నగదుతో లోక్‌సభ ఎన్నికల ముందు పెద్దయెత్తున మద్యం, ఖరీదైన వాహనాలను కొనుగోలు చేసినట్టు ఈడీ అధికారులు పేర్కొన్నారు. నగదు బదిలీకి వినియోగించిన బ్యాంకు ఖాతాలు నకిలీవని అనుమానం వ్యక్తం చేశారు. కాగా, కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకే కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్కామ్‌కు పాల్పడిందని, స్కామ్‌లోని రూ. 44.6 కోట్లు హైదరాబాద్‌కు చేరడాన్ని చూస్తే, ఇక్కడి కాంగ్రెస్‌కు కూడా ఈ స్కామ్‌తో సంబంధం ఉన్నట్టు అర్థమవుతున్నదని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఆ మంత్రి మాటలకు అర్థమేంటి?

కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్యకు నోటీసులు ఇచ్చినట్టే, రేవంత్‌కు కూడా రేపోమాపో నోటీసులు రావొచ్చంటూ కర్ణాటక మంత్రి సతీశ్ జార్కిహోళి ఇటీవల చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. 'వాల్మీకి' సామాజికవర్గానికి చెందిన బలమైన నేత జార్కిహోళి ఈ వ్యాఖ్యలు చేయడాన్ని చూస్తే.. ఈ స్కామ్‌లోనే సీఎంకు నోటీసులు వస్తాయా? అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

హైదరాబాద్‌లో ఏ కంపెనీ ఖాతాలో ఎంత డబ్బు అంటే??

సిట్ నివేదిక ప్రకారం సిస్టమ్ అండ్ సర్వీస్ కంపెనీకి రూ. 4.55 కోట్లు, రామ్ ఎంటర్‌ప్రైజెస్‌కు రూ. 5.07 కోట్లు, స్కిల్‌మ్యాప్ ట్రైనింగ్‌కు, రూ. 4.84 కోట్లు, స్వాప్ డిజైన్‌కు రూ. 5.15 కోట్లు, జీఎన్ ఇండస్ట్రీస్‌కు రూ. 4.42 కోట్లు, నోవెల్ సెక్యూరిటీకు రూ. 4.56 కోట్లు, సుజల్ ఎంటర్‌ప్రైజెస్‌కు రూ. 5.63 కోట్లు, గ్రాబ్ ఏ గ్రబ్‌కు రూ. 5.88 కోట్లు, వీ6 బిజినెస్‌కు రూ. 4.50 కోట్లు అందాయి.

సిట్ రెండో చార్జిషీట్‌లో ప్రధాన నిందితుల పేర్లు గాయబ్

'వాల్మీకి స్కామ్' విచారణ పక్కదారి పడుతున్నట్టు అర్థమవుతున్నది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ రెండో ఛార్జిషీట్‌లో కుంభకోణంలో ప్రధాన నిందితులైన మాజీ మంత్రి నాగేంద్ర, వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ బసనగౌడ దద్దల్, బ్యాంకు ప్రధానాధికారి పేర్లు కనిపించకపోవడం ఈ అనుమానాలకు తావిస్తున్నది.

కాపాడటానికేనా?

తొలి ఛార్జిషీట్‌లో నాగేంద్ర, బసనగౌడ, సుచిస్మితా రావల్ పేర్లను ప్రస్తావించిన సిట్.. శివమొగ్గ జిల్లా కోర్టుకు గురువారం సమర్పించిన రెండో ఛార్జిషీట్‌లో వారి పేర్లను ప్రస్తావించలేదు. కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జేజీ పద్మనాభ, మాజీ అకౌంట్స్ అధికారి పరశురామ్ జీ దుర్గాన్నవార్ పేర్లను మాత్రమే సిట్ ప్రస్తావించింది. దీంతో మాజీ మంత్రి, కార్పొరేషన్ ఛైర్మన్, యూబీఐ బ్యాంకు చీఫ్ మేనేజర్‌ను కాపాడటానికి ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసినట్టు ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

రాహుల్.. మౌనమేంటి?

'ముడా' స్కామ్‌పై నోరు మెదపని కాంగ్రెస్ అగ్రనేత

అసహనంతో సిద్ధరామయ్య.. తేల్చుకోవడానికి ఢిల్లీకి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ముడా కుంభకోణానికి సంబంధించి సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటిస్తూ తనకు అండగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి మాత్రం సరైన సంఘీభావం లభించకపోవడంపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అసహనంతో ఉన్నట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ విషయంపై ఇంతవరకూ ఎలాంటి ప్రకటన చేయకపోవడాన్ని సిద్ధరామయ్య జీర్ణించుకోలేకపోతున్నట్టు సన్నిహిత వర్గాలు చెప్తున్నాయి. అదానీ, బెంగాల్‌లో వైద్యురాలి హత్యాచార ఘటన, ఇలా దేశంలోని ప్రతీ అంశంపై స్పందిస్తున్న రాహుల్.. తనకు మద్దతుగా ఒక్క ప్రకటన కూడా చేయకపోవడంపై సిద్ధరామయ్య అసంతృప్తితో రగిలిపోతున్నట్టు తెలుస్తున్నది. దీంతో ఈ విషయంపై ఢిల్లీలోనే తేల్చుకోవాలని ఆయన నిర్ణయించుకొన్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే శుక్రవారం డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, హోంమంత్రి జీ పరమేశ్వరతో కలిసి ఆయన హస్తినకు వెళ్లి రాహుల్‌తో భేటీ అయినట్టు తెలుస్తున్నది. కాగా, ఈ భేటీలో ముడా స్కామ్‌లో అధిష్ఠానం నుంచి మద్దతు, ఈ కేసులో న్యాయపరంగా ఎలా ముందుకు వెళ్లాలి? బీజేపీ కుట్రలను తిప్పికొట్టే వ్యూహం తదితర అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్టు తెలుస్తున్నది.

తొలుత ఖర్గే కూడా..

ముడా స్కామ్‌లో సిద్ధరామయ్యను విచారించడానికి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ గత శనివారం అనుమతి ఇచ్చిన సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా బెంగళూరులోనే ఉన్నారు. దీనిపై మీడియా ప్రశ్నించగా.. 'గవర్నర్ నిర్ణయం నాకు తెలియదు. న్యాయవాదులతో చర్చించిన తర్వాతే మాట్లాడుతా' అంటూ వెళ్లిపోవడం సిద్ధరామయ్యకు షాకిచ్చింది. దీంతో సిద్ధరామయ్య వర్గం ఖర్గే తీరును ఎండగట్టింది. దీంతో 'బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం కుట్రలకు దిగుతున్న'దంటూ ఖర్గే ప్రకటన చేయాల్సి వచ్చింది.

ముడా స్కామ్‌లో సిద్ధరామయ్యపై కోర్టు ధిక్కరణ కేసు

ముడా కేసులో సిద్ధరామయ్యపై ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. తనకు ఖరీదైన ప్రాంతంలో స్థలాన్ని కేటాయించమని ముడా అధికారులకు సిద్ధరామయ్య భార్య పార్వతి లేఖ రాశారని స్నేహమయి కృష్ణ అనే వ్యక్తి తన పిటిషన్‌లో ఆరోపించారు. లేఖలో కీలక సమాచారాన్ని వైట్‌నర్‌తో కొట్టివేశారని, కోర్టుకు ఈ విషయాలు తెలియజేయకుండా సిద్ధరామయ్య ఉపశమనం పొందారని ఆరోపించారు.

ఖాళీ అవుతున్న హాస్టళ్లు

- హత్యాచార ఘటనతో ఆర్‌జీ కర్ కళాశాల విద్యార్థినులు, డాక్టర్లలో భయాందోళన
- సీబీఐ విచారణలో వెలుగు చూసిన కొత్త కోణం

తాళాలు వేసివున్న హాస్టల్ రూమ్‌లు

కోల్‌కతా, ఆగస్టు 23: జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనతో కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల విద్యార్థినులు, మహిళా డాక్టర్లు, సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒక్కొక్కరు హాస్టళ్లు, కళాశాల ప్రాంగణం వదిలి సొంతూర్లకు వెళ్లడం ప్రారంభించారు. ఈ నెల 14న కొందరు దుండగులు కర్రలు, రాళ్లు, రాడ్లతో దవాఖాన ప్రాంగణంలోకి చొరబడి దాడులు చేయడంతో వీరిలో భయాందోళనలు మరింత పెరిగాయి. అప్పటి నుంచి పెద్ద సంఖ్యలో హాస్టళ్లను వదిలిపెట్టి వెళ్లారు. దీంతో ఇప్పుడు లేడీస్ హాస్టళ్లన్నీ ఖాళీగా మారిపోయాయి. గతంలో క్యాంపస్ హాస్టళ్లలో 160 మంది మహిళా జూనియర్ డాక్టర్లు ఉండగా, ఇప్పుడు 17 మంది మాత్రమే ఉన్నారని, నర్సింగ్ హాస్టళ్లలోనూ ఇదే పరిస్థితి ఉందని విద్యార్థులు చెప్తున్నారు.

గడియ లేకపోవడమే ఘటనకు కారణమా?

ట్రెయినీ డాక్టర్ హత్యాచారం జరిగిన సెమినార్ హాల్ తలుపు గడియ విరిగి ఉండటం ఇప్పుడు సీబీఐకి కొత్త అనుమానాలు కలిగిస్తున్నది. ఆమెను అంత క్రూరంగా హింసిస్తున్నప్పుడు బయటకు శబ్దం వినిపించి ఉండాలని సీబీఐ భావిస్తున్నట్టు సమాచారం. ఈ కేసులో అరెస్టయిన నిందితుడు సంజయ్ రాయ్‌కు కోర్టు శుక్రవారం 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించింది.

విధుల్లోకి చేరిన వైద్యులు

11 రోజుల పాటు సమ్మె నిర్వహించి విధులకు దూరంగా ఉన్న వైద్యులు శుక్రవారం మళ్లీ విధుల్లో చేరారు. సుప్రీం కోర్టు సూచన మేరకు సమ్మె విరమిస్తున్నట్టు ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ ప్రకటించాయి. దీంతో శుక్రవారం దేశంలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో వైద్యులు విధుల్లోకి చేరారు.

నాలుగేండ్ల చిన్నారిపై లైంగిక దాడి

జైపూర్: రాజస్థాన్‌లోని గంగా నగర్‌లో నాలుగేళ్ల బాలికపై ఆమె బంధువు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆమె తల్లి గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లినపుడు ఈ దారుణం జరిగింది. ఆమె తల్లి తిరిగి రాత్రి 9 గంటల సమయంలో వచ్చి చూసేసరికి ఆ బాలిక గాయపడి, ఏడుస్తుండటాన్ని గమనించారు. బాధితురాలిని సూరత్‌గఢ్‌లోని దవాఖానలో చేర్పించి, చికిత్స చేయిస్తున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

లైంగిక దాడి తర్వాత పెండ్లి.. అయినా 20 ఏండ్ల జైలు

కోటా: రాజస్థాన్‌లో 17 ఏండ్ల మైనర్ బాలికను అపహరించి, అత్యాచారం చేసిన వ్యక్తికి 20 ఏండ్ల జైలు శిక్ష పడింది. లైంగి దాడి తర్వాత బాధితురాలిని నిందితుడు పెండ్లి చేసుకొన్నా కోర్టు శిక్షను ఖరారు చేయడం గమనార్హం. బుండి సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బిషన్‌పుర గ్రామంలో కౌశల్ రాజ్ అనే వ్యక్తి 2019లో ఒక మైనర్ బాలికను అపహరించాడు. పోక్సో చట్టం కింద కోర్టు, ముద్దాయికి 20 ఏండ్ల జైలు, రూ.1.30 లక్షల జరిమానా విధించింది.

బాలికపై లైంగిక దాడికి నిరసనగా నాగావ్ జిల్లాలో స్థానికుల ఆందోళన

అస్సాంలో బాలికపై గ్యాంగ్ రేప్

- ట్యూషన్ నుంచి వస్తుండగా అఘాయిత్యం
- స్థానికుల ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితులు
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

గువాహటి, ఆగస్టు 23: దేశంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు ఆగడం లేదు. తాజాగా అస్సాంలోని నాగావ్ జిల్లా దింగ్ ప్రాంతంలో 14 ఏండ్ల బాలిక సామూహిక లైంగిక దాడికి గురైంది. బాలిక ట్యూషన్ నుంచి తిరిగి వస్తుండగా అడ్డగించిన ముగ్గురు వ్యక్తులు ఈ దురాగతానికి ఒడిగట్టారని పోలీసులు శుక్రవారం వెల్లడించారు. గ్యాంగ్ రేప్ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులను అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి 8 గంటల సమయంలో బాలిక సైకిల్‌పై ఇంటికి వస్తుండగా, బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఆమెను అడ్డగించి సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలపాలై, అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను రోడ్డు పక్కన ఒక కుంట సమీపంలో వదిలేసి వెళ్లారు. అనంతరం బాలికను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలిని నాగావ్‌లోని ఓ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. నిందితుల్లో ఒకరిని అరెస్టు చేశామని, మిగతా వాళ్ల కోసం గాలిస్తున్నామని పోలీసులు వెల్లడించారు.నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హిమంత బిశ్వ చెప్పారు.

తమిళనాడు ఘటనలో నిందితుడి ఆత్మహత్య!

చెన్నై: తమిళనాడులో నకిలీ ఎన్‌సీసీ శిబిరంలో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ప్రధాన నిందితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు! నిందితుడు శివరామన్‌ను పోలీసులు ఆగస్టు 19న అరెస్టు చేశారు. అంతకు ముందే అతడు పురుగుల మందు తాగాడని, దవాఖానలో చికిత్స పొందుతూ చనిపోయాడని పోలీసులు ప్రకటించారు.

రేప్ బాధితురాలి ఆత్మహత్య

లక్నో: ఉత్తర ప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్‌లో సామూహిక అత్యాచారం బాధితురాలు ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె తండ్రి తెలిపిన వివరాల ప్రకారం, బాధితురాలిని ముగ్గురు వ్యక్తులు ఈ నెల 17న తీసుకెళ్లి, సామూహిక అత్యాచారం చేసి, ఓ పాఠశాల వద్ద పడేశారు. ఆమెను గుర్తించిన ఓ వ్యక్తి ఆయనకు ఫోన్ చేసి, చెప్పారు. ఆమె హెల్ప్ లైన్ ఫోన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఫిర్యాదు చేసిన రెండు గంటల్లోనే ఆమె ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు సామూహిక అత్యాచారం నేరం జరిగినట్లు కేసు నమోదు చేయడానికి తిరస్కరించారు. కేవలం ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు మాత్రమే కేసు నమోదు చేశారు.

బస్ బోల్తా..27 మంది మృతి

నేపాల్‌లో నదిలోకి దూసుకెళ్లిన మహారాష్ట్ర యాత్రికుల బస్సు

ముంబై, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): నేపాల్‌లో శుక్రవారం ఉదయం ఘోర బస్సు ప్రమాదం చోటు చేసుకుంది. 41 మంది భారత యాత్రికులతో వెళ్తున్న బస్సు నదిలోకి పడటంతో మహారాష్ట్రకు చెందిన 27 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. బస్సు తనాహున్ జిల్లా ముగ్లింగ్ సమీపంలో కొండల ప్రాంతంలో వెళ్తుండగా అదుపు తప్పి పక్క లోయలోని మర్త్యంగడి నదిలోకి బోల్తా కొట్టింది.

దైవ దర్శనం కోసం వెళ్తుండగా..

భుసావల్ గ్రామానికి చెందిన 104 మంది బృందం దైవదర్శనం కోసం రెండు రోజుల క్రితం నేపాల్ వెళ్లింది. ప్రమాదంపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు.

మెదడులోకీ మైక్రో ప్లాస్టిక్

అంకారా, ఆగస్టు 23: మానవ శరీరాన్ని ప్లాస్టిక్ ఆక్రమించేస్తున్నదని, ఆఖరికి మెదడు కణజాలంలోకి కూడా మైక్రోప్లాస్టిక్ చేరిందని పరిశోధకులు గుర్తించారు. మృత దేహాల నుంచి మెదడు, కాలేయం, మూత్రపిండాల నమూనాలను సేకరించిన పరిశోధకులు అధ్యయనం చేయగా అన్నింటిలో ప్లాస్టిక్ ఆనవాళ్లు ఉన్నట్టు గుర్తించారు. 91 మెదడు నమూనాలను పరిశీలించగా ఇతర అవయవాల కంటే ఎక్కువ మైక్రోప్లాస్టిక్ ఉన్నట్టు న్యూ మెక్సికో యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు మాథ్యూ కాంపెన్ తెలిపారు. 24 మెదడు నమూనాల్లో అయితే మొత్తం బరువులో 0.5 శాతం వరకు ప్లాస్టిక్ ఉన్నట్టు చెప్పారు. డిమెన్షియా, అల్జీమర్స్ వంటి సమస్యలు ఉన్న వారి మెదళ్లలో ప్లాస్టిక్ ఎక్కువ ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు.

చైనాలో డ్రోన్లతో ఫుడ్ డెలివరీ

*బీజింగ్, ఆగస్టు 23: చైనా డ్రోన్ల ద్వారా ఆహార డెలివరీని ప్రారంభించింది. ప్రపంచంలోని అద్భుత కట్టడాల్లో ఒకటైన గ్రేట్ వాల్ ఆఫ్ చైనాను సందర్శించేవారికి ఫుడ్ డెలివరీ దిగ్గజం మెయిటువాన్ ఈ సేవలు అందించనుంది. గ్రేట్ వాల్ ఆఫ్ చైనా వద్ద ఓ హోటల్ పైకప్పు నుంచి సమీపంలోని వాచ్ టవర్ వరకు ఈ సేవలను ఏర్పాటు చేసినట్టు మెయిటువాన్ డైరెక్టర్ యాన్ యాన్ తెలిపారు. సాధారణంగా ఫుడ్ డెలివరీ చేసేందుకు కనీసం 50 నిమిషాల సమయం పడుతుందని, అదే డ్రోన్ల ద్వారా అయితే కేవలం 5 నిమిషాల్లోనే చేరవేయవచ్చని చెప్పారు. సాయంత్రం 4 గంటల వరకే ఆర్డర్లను స్వీకరిస్తామని, ఆ తర్వాత గ్రేట్ వాల్‌పై పర్యాట